# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

| సంచిక : 383 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | గురువారం | 13-3 -2025 | వెల : .రూ. 5.00 |
|---|---|---|---|---|---|



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




## తెలంగాణలో మండే కాలం

- ఎండల తీవ్రత పెరుగుతోంది
- వాతావరణశాఖ హెచ్చరిక

హైదరాబాద్,మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)
మార్చి 13 నుంచి తెలంగాణలో ఎండలు కాక పుట్టించనున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. వేడి గాలులతో, వడగాల్పులతో వాతావరణం మార్చిలోనే మే నెల ఎండలను

-మిగతా 2 లో

## అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరు

### స్వాగతించిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

హైదరాబాద్,మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీకి హాజరయ్యారు. దాదాపు 50 నిమిషాలు ముందుగానే అసెంబ్లీకి వచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్వాగతం పలికారు. అయితే గత పదిహేను నెలలుగా ప్రధాన ప్రతిపక్షనేతగా కేసీఆర్ అసెంబ్లీకి రావడంలేదన్న విమర్శల నేపథ్యంలో.. ఈసారి అసెంబ్లీకి హాజరుకావాలని నిర్ణయించుకున్నారు.

-మిగతా 2 లో



## ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

హైదరాబాద్,మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారానికి హైడ్రా చేస్తున్న కృషిని కమిషనర్ రంగనాథ్ వివరించారు. ఒకప్పటి చెరువుల పరిస్థితి, ఇప్పటి పట్టణీకరణ, హైడ్రా చేస్తున్న పనులపై బుధవారం ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజావాణికి నేరుగా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్‌లో కూడా

-మిగతా 2 లో





### గాంధీభవన్‌లో ప్రెస్‌మిట్‌లా

## గవర్నర్ ప్రసంగం

- గవర్నర్ చేత అన్నీ అబద్ధాలు చెప్పించాలి
- పంటలు ఎండుతున్నా ఎక్కడా ప్రస్తావన లేదు
- మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)
గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు.

-మిగతా 2 లో



## ఉద్యోగులకు అభయం

### లెక్చరర్లు కళాశాలను తీర్చిదిద్దాలి

- ప్రభుత్వ విద్యారంగం తీరు అధ్వాన్నం
- ప్రైవేటు రంగంతో పోటీపడలేక పోతున్నారు
- గత పాలనలో నిరుద్యోగ సమస్య తీవ్రం
- అధికారంలోకి రాగానే 55 రోజుల్లో నియామకాలు
- ఉద్యోగ నియామకపత్రాలు అందించిన సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణలోని ఇంటర్ కాలేజీలను గొప్పగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత జూనియర్ లెక్చరర్ల మీద ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు

-మిగతా 2 లో






### అభివృద్ధి, ప్రగతివైపు

## తెలంగాణ అడుగులు

- రైతుల అభివృద్ధికి అనేక రకాల చర్యలు
- రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాల అమలు
- రికార్డు స్థాయిలో 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పతి
- తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉంది
- గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచింది
- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు
- తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ జిష్టుదేవ్ వర్మ ప్రసంగం
- సభకు హాజరైన విపక్షనేత కేసీఆర్

హైదరాబాద్,మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)
అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు వేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. మా ప్రభుత్వం సామాజిక న్యాయం సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణకు రైతులే ఆత్మ అని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని,

-మిగతా 2 లో



## 19న బడ్జెట్.

- మార్చి 27 వరకు అసెంబ్లీ సమావేశాలు
- 17,18 తేదీల్లో బీసీ రిజర్వేషన్లపై చర్చ
- 19న బడ్జెట్..21,22 తేదీల్లో చర్చ
- బీఏసి సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్,
తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మార్చి 27 వరకు జరుగుతాయి. 14న హోలీ, 16న ఆదివారం, 20, 23న సెలవులు ఉన్నాయి. ఈ నాలుగు రోజులు మినహాయించి 12 రోజులు సమావేశాలు జరగబోతున్నాయి. చాలా రోజుల

-మిగతా 2 లో



### 20రోజుల పాటు

## అసెంబ్లీ జరపాలి

- బీఏసీ సమావేశంలో డిమాండ్ చేశాం
- మాజీ మంత్రి హరీష్ రావు వెల్లడి

హైదరాబాద్,మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)
కనీసం 20 రోజులు అసెంబ్లీ నడపాలని బీఏసీలో డిమాండ్ చేశామని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. బీఏసీ సమావేశం తర్వాత మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాజీ మంత్రి మాట్లాడుతూ.. ప్రశ్నా పత్రాలు లీక్ అయినట్లు.. అసెంబ్లీ బిజినెస్ ముందే లీక్ అవటంపై అభ్యంతరం తెలిపామన్నారు. ప్రతిపక్షాలకు మైక్

-మిగతా 2 లో

# ఉద్యోగులకు అభయం

(మొదటి తరువాయి)

వేగంగా చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం సాగదీసి నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైందని.. కానీ తాము మాత్రం 55 రోజుల్లోనే నియామకాలు పూర్తి చేశామని రేవంత్ చెప్పుకొచ్చారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన 1292 మంది జూనియర్ లెక్చరర్లకు, 240 మంది పాలిటెక్నికల్ లెక్చరర్లకు రవీంద్ర భారతిలో సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పడిపోవడం ఆందోళనకరమన్నారు. కొత్తగా నియామకమైనవారు తెలంగాణ భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. ఉద్యోగాలపై కోర్టుల్లో చిక్కుముడులు విప్పుతూ సమస్యలు పరిష్కరిస్తున్నా మన్నారు. తెలంగాణలో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలతో గవర్నమెంట్ విద్యాలయాలు పోటీ పడలేకపోవడం బాధాకరం అన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదువు చెప్పే వారికన్నా గవర్నమెంట్ లెక్చరర్లకే ఎక్కువ నాలెడ్జ్ ఉందని.. అయినా రిజల్ట్ వారికంటే తక్కువ రావడంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రైవేట్ సంస్థలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలను తీర్చి దిద్దాలని చెప్పుకొచ్చారు. ఒక ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం వస్తే..ఆ కుటుంబ భవిష్యత్ మారిపోతుందని.. వారి కష్టాలన్నీ తొలగిపోతాయని వివరించారు. భవిష్యత్ లో మరిన్ని నోటిఫికేషన్లు ఇచ్చి తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడటంలో నిరుద్యోగుల పాత్ర కీలకం అని గుర్తు చేశారు.ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న వారికి సీఎం అభినందలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాటల ప్రకారం 57,946 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గర్వంగా చెబుతున్నామన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అయినా మొదటి సంవత్సరంలోనే 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టిన రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అభివృద్ధి పథంలో నడిస్తే భవిష్యత్‌తరాల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగం కూడా ఒక కారణమన్నారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. కేసీఆర్ కుటుంబంలో ఉద్యోగాలు పోవడం వల్లే ఇప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 50 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని గ్రహించాలన్నారు. 55 రోజుల్లోనే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. విద్యార్థులపై ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదని.. అది వారి భవిష్యత్‌కు పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచాలని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మించబోతున్నామన్నారు. ఇటీవలే 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.11000 కోట్లు కేటాయించామని తెలిపారు. విద్యార్థి, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యం ఉండాలన్నారు. ప్రపంచమంతా తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఐటీ, ఫార్మా రంగాల్లో ప్రపంచానికే తెలంగాణ నుంచి ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడలు మన దేశ ప్రతిష్టను పెంపొందిస్తాయని చెప్పుకొచ్చారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామన్నారు. బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామన్నారు. పారాలింపిక్స్ క్రీడాకారిణి దీప్తికి గ్రూప్-2 ఉద్యోగం ఇచ్చామని అన్నారు. కొంతమంది స్ట్రెచర్ స్ట్రెచర్ అని మాట్లాడుతున్నారని.. స్ట్రెచర్ ఉందని విర్రవీగినవారు స్ట్రెచర్ మీదకు వెళ్లారన్నారు. స్ట్రెచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండదని తెలిపారు. కేసీఆర్ తమకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమే అని అన్నారు. ప్రతీ నెలా రూ. 6500 కోట్లు కేసీఆర్ చేసిన అప్పులు తప్పులకే సరిపోతుందన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారని.. క్యాన్సర్ ముదురుతుంటే రాష్ట్రం దివాళా తీసిందంటారా అని అంటున్నారని.. వాస్తవాన్ని ఎన్నాళ్ళు దాచిపెడతారని అన్నారు. తాను వాస్తవాలు చెబుతుంటే? దిగిపో దిగిపో అని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం మొత్తం ఫ్యామిలీ ప్యాకేజ్‌లా అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. 'అబద్దాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడపను. వాస్తవాలు మీతో పంచుకుని రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా. తెలంగాణలో భావితరాల భవిష్యత్ నిర్మాణానికి మీ సహకారం అవసరం. ఎంతసేపు సీఎం కుర్చీని లాక్కుంటామంటే ఎలా.. నన్ను పనిచేయనివ్వాలి కదా మీరు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రరభాకర్, కేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, సిఎస్ శాంతికుమారి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు

(మొదటి తరువాయి)

ప్రజల కోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలు అని జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని ప్రశంసించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగించారు. తెలంగాణ భౌగోళిక ప్రాంతమే కాదని, ఒక భావోద్వేగ ప్రాంతమని, స్థిరత్వం, దృఢ సంకల్పానికి గుర్తు తెలంగాణ అని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతివ్వడం వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే తమ బాధ్యత అని, దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలియజేశారు. రైతులకు రుణమాఫీ చేశామని, ఇదే రైతుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని, ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని, రైతు నేస్తం అమలు చేస్తున్నామని, వరికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణి కల్పిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ వివరించారు. ఘనమైన సంస్కృతి నిలయం తెలంగాణ అని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారన్నారు. జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామని తెలిపారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నామన్నారు. తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ అని అన్నారు. ప్రజలే కేంద్రంగా పాలన కొనసాగుతోందని గవర్నర్ వెల్లడించారు. ల్గ÷తులకు మద్దతివ్వడం, వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. దేశంలోనే ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని.. ఇదే రైతుల పట్ల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 23.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని తెలిపారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు. తెలంగాణ పురోగమించడమే కాదు.. రూపాంతరం చెందుతోందన్నారు. సమ్మిళిత, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ విజన్‌తో పని చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిగా ఉండేలా తెలంగాణ నమూనా ఉండాలని, తెలంగాణ భౌగోళిక పాత్రమే కాదు.. ఒక భావోద్వేగమన్నారు. తెలంగాణ స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు అన్నారు.రైతుల స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తోందన్నారు. 260లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇది మన రైతుల స్థిరత్వం, అంకిత భావానికి ఓ సాక్ష్యమన్నారు. రూ.2లక్షల పంట రుణమాఫీని అమలు చేస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఇది ప్రభుత్వం చేసిన వాగ్దానాల నిర్దిష్ట కాల అమలుకు సాక్ష్యమన్నారు. రైతు భరోసా కింద నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారత లభిస్తోంది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అగశ్రేణి శిక్షణ అందుతోంది. సివిల్ సర్వీసు పరీక్షల ఆశావహుల కోసం రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం తెచ్చాం. గతేడాది 55 వేల మందిగా పైగా యువత పభుత్వోద్యోగాలు పొందారు. ఆరోగ్యశ్రీ పథకం కవరేజీ రూ.10 లక్షల వరకు పెంచాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు ప్రతిపాదించాం. ఎస్సీ ఉపవర్గీకరణ కోసం బిల్లును ప్రవేశపెట్టనున్నామని గవర్నర్ అన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ గురువారానికి వాయిదా పడింది.

## గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం

(మొదటి తరువాయి)

ప్రజలకు ఇచ్చిన 420 హామీలు ఈ ప్రభుత్వం, ఆరు గ్యారంటీల గురించి ఏమైనా కొత్త విషయాలు చెబుతారేమోనని అనుకున్నామన్నారు. 'గత 15నెలల పేలవమైన, అట్టర్‌లాప్ పరిపాలన గురించి ప్రాయశ్చిత్తం చేసుకునేవిధంగా గవర్నర్ ప్రసంగం ఉంటుందని భావించాం. ఇది గవర్నర్ ప్రసంగం లేదు. ఒకమాటలో చెప్పాలంటే గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉంది తప్పా.. గవర్నర్ ప్రసంగంలా లేదు. గవర్నర్ నోటి వెంట ఒకటికాదు రెండు చాలా అబద్దాలు చెప్పించారు. గవర్నర్ నోటివెంట అసత్యాలు పలకాల్సి రావడంపై బాధపడుతున్నాం. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్ల ఈ రోజు రాష్ట్రంలో రైతాంగం ఆందోళనలో ఉందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నయ్. ఇప్పటికే 480 పైచీలుకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీసం ఒక మాట రైతులకు స్వాంతన చేకూర్చే, ఉపశమనం, భరోసా ఇచ్చేమాట గవర్నర్ నోటినుంచి వస్తుందేమోననని ఆశించాం. పంటలు ఎండిపోకుండా కాపాడుతాం. పంటలకు నీరు ఇస్తాం. బుద్ధి తెచ్చుకున్నాం. ఇకనైనా బుద్ధితో మెదులుతామని చెప్పి ఒక్క మాట చెబుతారని అనుకున్నాం. వారి నోటివెంట ఒక్క మాట రాలేదు. అసలు ఈ రోజు వరకు రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 25శాతం నుంచి 30శాతానికి మించి రుణమాఫీ జరుగలేదు. దీనిపై పోయిన శాసనసభలో ప్రభుత్వాన్ని అడిగినం. సీఎం సొంత ఊరికి పోదామా? సొంత నియోజకర్గానికి పోదామా? ప్లేస్, సమయం మీ ఇష్టం.. ఊరు మీష్టం అని చెప్పాం. ఒక ఊరిలో వందశాతం రుణమాఫీ జరిగితే మేం అందరం రాజీనామా చేస్తామని చెప్పాం. కానీ, మళ్లీ ఈ రోజు గవర్నర్ నోటివెంట రుణమాఫీ అయిపోయింది.. లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నరని గవర్నర్‌తో అబద్దాలు చెప్పించి.. గవర్నర్ స్థాయిని సైతం దిగజార్చి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని, నీచత్వాన్ని బయటపెట్టుకుంది' అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

## అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరు

(మొదటి తరువాయి)

ఇందులో భాగంగా 50 నిమిషాలు ముందుగానే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్.. ముందుగా అసెంబ్లీ ఇన్నర్ లాబీలోని బీఆర్ఎస్ఎల్పీలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అధినేత సమావేశమయ్యారు. అయితే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినా పలువు పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలు సమయానికి సభకు రాలేదు. మంగళవారం జరిగిన ఎల్పీ సమావేశంలో బీఆర్ఎస్ సభ్యులంతా ముందుగానే అసెంబ్లీకి రావాలని కేసీఆర్ ఆదేశించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ పార్టీలోని పలువురు సభ్యులు మాత్రం తీరుమార్చుకోని పరిస్థితి.మరోవైపు బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ప్రతిపక్షనేత కేసీఆర్‌ను అశ్వారావుపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆదినారాయణ కలిశారు. మర్యాదపూర్వకంగానే కేసీఆర్‌ను కలిశానని కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గతంలో ఆదినారాయణ బీఆర్ఎస్‌లో పనిచేశారని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అయితే అసెంబ్లీ లాబీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మాజీ మంత్రి కేటీఆర్ (ఈనీసప।స ఓతినితిబబి।స ఐ÷ఃఖీ) ముచ్చటించారు. ముఖ్యమంత్రి పేరు ఏంటంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆదినారాయణను అడిగారు కేటీఆర్. రేవంత్ రెడ్డి అంటూ ఎమ్మెల్యే సమాధానం ఇచ్చారు. అయితే బీఆర్ఎస్ ప్రోడక్ట్ కాబట్టి సరైన సమాధానం చెప్పారంటూ కేటీఆర్ టీజ్ చేశారు. అయితే 2014 ఎన్నికల్లో అశ్వారావుపేట నుంచి బీఆర్ఎస్ తరవున ఆదినారాయణ పోటీ చేసిన విషయం తెలిసిందే.

## 20రోజుల పాటు అసెంబ్లీ జరపాలి

(మొదటి తరువాయి)

ఇవ్వొద్దని సీఎం స్వయంగా స్పీకర్‌ను బుల్డోజ్ చేస్తున్న విషయాన్ని బీఏసీలో లేవనెత్తామని తెలిపారు. సంఖ్యా బలాన్ని బట్టి బీఆర్ఎస్‌కు సభలో సమయం ఇవ్వాలని కోరామన్నారు. తమ విజ్ఞప్తికి అంగీకారం తెలిపారన్నారు. రైతాంగ సమస్యలు, తాగు సాగు నీటి సమస్యలపై చర్చించాలని కోరామని.. వివిధ ప్రాజక్టులు కూలిపోవటంపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశామన్నారు. మంత్రులు సభకు ప్రిపేర్ అయ్యి రావాలని కోరామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి స్పీకర్ చొరవ తీసుకుని నిధులు ఇప్పించాలని కోరినట్లు చెప్పారు. నదీ జలాల వినియోగంలో విఫలం రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఏసీలో చెప్పామన్నారు. ఏపీ నీళ్ళు తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూసిందని విమర్శించారు. బిల్లులు చెల్లింపుకు 20 శాతం కమిషన్ విషయాన్ని అసెంబ్లీలో చర్చించాలని కోరినట్లు తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోవటం చర్చించాలని, బార్స్, వైన్స్, బెల్ట్ షాపులు పెంచటంపై చర్చించాలని కోరినట్లు చెప్పారు. ఎల్ఆర్ఎస్ ఉచిత హామీపై చర్చ జరపాలని డిమాండ్ చేశామన్నారుర. కాళేశ్వరం ప్రాజెక్టును కూలిన పిల్లర్‌ను కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారని బీఏసీలో చెప్పామన్నారు. నిరుద్యోగభృతి, జాబ్ క్యాలెండర్ పై అసెంబ్లీలో చర్చించాలని బీఏసీలో కోరినట్లు హరీష్ రావు వెల్లడించారు.

## 19న బడ్జెట్.

(మొదటి తరువాయి)

తర్వాత మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటారని కెటిఆర్ ఇప్పటికే ప్రకటించారు. అటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును 15వ తేదీన ప్రవేశపెట్టబోతోంది. 17, 18వ తేదీల్లో బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేకంగా చర్చలు జరుపుతారు. కీలకమైన బడ్జెట్ ను 19వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెడుతారు. 20వ తేదీన సెలవు కాబట్టి 21, 22వ తేదీల్లో బడ్జెట్ మీద చర్చిస్తారు. 24 , 25, 26వ తేదీల్లో పద్దులపై చర్చలు జరుపుతారు. చివరగా 27వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశ పెడుతారు. ఈ సమావేశాలు అత్యంత కీలకం కానున్నాయి. ఎందుకంటే బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం బీసీలంతా ఎదురు చూస్తున్నారు. ఈ బిల్లులో బీసీ రిజర్వేషన్ల కోటాపై స్పష్టత వస్తే కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయి. అంతే కాకుండా కేసీఆర్ ఓడిపోయిన తర్వాత మొదటిసారి అసెంబ్లీలో ప్రసంగించబోతున్నారు. ప్రతిపక్షాలకు ధీటుగా సమాధానాలు చెప్పాలని రేవంత్ ప్రభుత్వం కసరత్తులు స్టార్ట్ చేసింది. కాబట్టి గతంలో జరిగిన సమావేశాల కంటే ఈ సమావేశాలు మరింత వేడెక్కడం ఖాయం. స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశంలో అసెంబ్లీ పనిదినాలపై చర్చించారు. అసెంబ్లీలో స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈనెల 27 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. గురువారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టి.. దానిపై చర్చించి ఆమోదం తెలుపనున్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి

(మొదటి తరువాయి)

చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ రాబోతోందని తెలిపారు. ఎప్పటికప్పుడు ఫిర్యాదుల పరిష్కారం కోసం కృషి చేస్తున్నా.. ఇంకా 10వేలకు పైగా పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

## తెలంగాణలో మండే కాలం

(మొదటి తరువాయి)



తలపించనుంది. హైదరాబాద్ నగరంలో పగటి పూట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానున్నాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, యాదాద్రి, మెదక్, సిద్ధిపేట్, సిరిసిల్ల, కామారెడ్డి, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నారాయణ్ పేట్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతుందని వాతావరణ శాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వేసవికాలం ప్రారంభమైన మొదట్లోనే టెంపరేచర్ 40 డిగ్రీలకు చేరువలో ఉంది. మరో రెండు నెలలు వేసవి కాలం ఉండడంతో ప్రస్తుత ఉష్ణోగతలను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గత మూడునాలుగు రోజుల నుంచి సూర్యాపేట జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో 38 డిగ్రీలకు పైగా, 10 ప్రాంతాల్లో 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరుబావుల్లో నీరు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో సాధారణంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ మార్చి రెండో వారంలోనే 35 డిగ్రీలకు చేరుకొని ఆ తర్వాత 40కి అటు ఇటుగా నమోదవుతుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మార్చి 4న 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంతకుముందు వారం రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఈనెల 1న 33 డిగ్రీలు, 2న 35 డిగ్రీలు, 3న మరో రెండు డిగ్రీలు పెరిగి 37కు చేరింది. ఈనెల 4న ఏకంగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నాలుగు మండలాల్లో 38.03 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఎండాలను చూస్తున్న జనం రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు.


## తెలుగు పంచాంగం 12/2025,బుధవారం



సూర్యోదయం: ఉదయం 6:29
సూర్యాస్తమయం: సాయంత్రం 6:21
తిథి:
చతుర్దశి: మార్చి 12 ఉదయం 9:12 నుండి మార్చి 13 ఉదయం 10:36 వరకు
పౌర్ణమి: మార్చి 13 ఉదయం 10:36 నుండి మార్చి 14 మధ్యాహ్నం 12:24 వరకు
నక్షత్రం:
పూర్వ ఫాల్గుని: మార్చి 13 ఉదయం 4:05 నుండి మార్చి 14 ఉదయం 6:19 వరకు
ఉత్తర ఫాల్గుని: మార్చి 14 ఉదయం 6:19 నుండి మార్చి 15 ఉదయం 8:54 వరకు
అశుభ సమయాలు :
రాహుకాలం: మధ్యాహ్నం 1:54 నుండి 3:23 వరకు
యమగండం: ఉదయం 6:29 నుండి 7:58 వరకు
దుర్ముహూర్తం: ఉదయం 10:26 నుండి 11:14 వరకు, మధ్యాహ్నం 3:11 నుండి 3:59 వరకు
వర్జ్యం: మధ్యాహ్నం 12:49 PM నుండి 2:34 PM వరకు
శుభ సమయాలు :
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:01 నుండి 12:49 వరకు
అమృత కాలం: రాత్రి 11:18 నుండి 1:03 (మార్చి 14)
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:52 నుండి 5:40 వరకు

# రేఖల రాందాస్ కు మండల నాయకులు ఘన నివాళి


**హాజరైన వివిధ పార్టీల నాయకులు**



మార్చి 12 వలిగొండ ప్రతినిధి మార్చి 12(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మాజీ సర్పంచ్ రేఖల రాందాస్ గౌడ్ దశదినకర్మ బుధవారం మండల పరిధిలోని టేకులసోమవారం గ్రామంలో ఎంఎంఎస్ ఫంక్షన్ హాల్ లో వారి కుమారులు ఏర్పాటుచేసిన దశదినకర్మ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు హాజరై రాందాస్ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో రేఖల బాలరాజ్ పిఎసిఎస్ చైర్మన్ సురుకంటి వెంకట్ రెడ్డి మాజీ ఎంపీటీసీ పలుసం రమేష్ రమేష్ రెడ్డి లక్ష్మీనారాయణ గౌడ్ వివిధ పార్టీల నాయకులు బంధువులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు అసెంబ్లీ ఆవరణలో ఘన స్వాగతం

**పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్, మార్చి 12(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణలో భాగంగా బుధవారం అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి కెసిఆర్ కు పుష్ప గుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు పార్టీ అధినేత, ప్రతిపక్ష నేతగా కెసిఆర్ హాజరు కావడం పట్ల రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, మా పట్ల ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు కెసిఆర్ సిద్ధమయ్యారని భావనతో ప్రజలు ఉన్నారని ఈ సందర్భంగా నవీన్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# ప్రేమ్ నాయక్ ను సన్మానించారు బీజేపీ నాయకులు



ఆమనగల్లు, మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్ ఉద్యోగ సంఘ ఎన్నికల్లో జనరల్ సెక్రటరీగా భారీ మెజార్టీతో విజయం సాధించిన ప్రేమ్ నాయక్‌ను ఆమనగల్లు బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు.
మొట్టమొదటిసారిగా ఆమనగల్లు విచ్చేసిన ప్రేమ్ నాయక్‌కు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నాయకుడిగా, బంజారా గిరిజన సమాజానికి చెందిన ప్రేమ్ నాయక్ ఈ విజయంతో తన సమాజానికి గర్వకారణంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీజేపీ పార్టీ అధ్యక్షులు కర్నాటి విక్రమ్ రెడ్డి, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్, నాగర్ కర్నూల్ కో కన్వీనర్ రవి రాథోడ్, నరేంద్ర రాథోడ్, జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యులు లక్ష్మణ్, బాలు, భాస్కర్, ఆనంద్, శ్రీనివాస్, నారి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులకు ఆమోదిస్తూ జీఓ విడుదల.!!

**- స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను 50కి పెంచుతూ జీఓల విడుదల**
**-సీఎంకు, రెవెన్యూ శాఖ మంత్రి కి ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ కలెక్టర్ల సంఘం**
**-హర్షం వ్యక్తం చేసిన టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ**


హైదరాబాద్,మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)
రెవెన్యూ చరిత్రలోనే మరో నూతన అధ్యాయం ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు ఉన్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టునే ఉన్నతంగా ఉండేది. దాని కంటే కూడా అత్యున్నతమైన 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడమే కాకుండా జీవోను కూడా బుధవారం విడుదల చేసింది. జీవో విడుదల పట్ల డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 33 పోస్టుల ఏర్పాటుకు ప్రభుత్వ పెద్దల కృషి ఫలితంగానే సాధ్యమైందన్నారు. క్యాబినెట్‌లో ఆమోదించడం, ఆ తర్వాత వెంటనే జీవో విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే కాకుండా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుల సంఖ్యను కూడా 50కి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జీవోను కూడా విడుదల చేసిందన్నారు.

**డీసీఏ కృషి ఫలింగానే సాధ్యమైంది:రెవెన్యూ ఉద్యోగ సంఘాలు...**

ఉమ్మడి రాష్ట్రంలోనూ సాధ్యం కాని 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను సాధించిన ఘనత డిప్యూటీ కలెక్టర్ల సంఘానికే దక్కుతుందని తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం పేర్కొన్నారు. 33 సెలక్షన్ గ్రేడ్ పోస్టులను సాధించడం, స్పెషల్ గ్రేడు డిప్యూటీ కలెక్టర్ పోస్టులను 39 నుంచి 50కి పెంచడంలోనూ డిప్యూటీ కలెక్టర్ల సంఘం పాత్ర కీలకంగా ఉందన్నారు. రెవెన్యూ శాఖ బలోపేతానికి కూడా క్షేత్ర స్థాయిలో పని చేసేందుకు 10,954 పోస్టులు, కొత్త డివిజన్లు, మండలాలలో 361 పోస్టులను సైతం మంజూరు చేయించిన ఘనత దక్కుతుందన్నారు. అన్ని రకాలుగా కృషి చేసిన ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**మోత్కూల గూడ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం**



నందిగామ, మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)
రంగారెడ్డి జిల్లా,నందిగామ మండలం, మోత్కూల గూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా ఉపాధ్యాయ బాధ్యతలను నిర్వహించగా వారిని ప్రధాన ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు రుక్మయ్య మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులుగా పాత్ర వహించి పాఠశాలలోని మిగతా విద్యార్థులకు పాఠాలు బోధించడం జరిగిందన్నారు.అదేవిదంగా దీనివల్ల నిజ జీవితంలో కూడా సమాజంలో ఏ విధంగా ఉండాలని విషయాలలో స్వయం అనుభవం ద్వారా విద్యార్థులకు స్వయంగా తెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రుక్మయ్య, లింబ్య, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు పావని,అమ్మ ఆదర్శం పాఠశాల కమిటీ చైర్మన్ భాగ్యమ్మ , పావని, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పురపాలిక వద్దు.. పంచాయతే ముద్దు..!

**-చిట్యాల గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని గ్రామస్తులు డిమాండ్**
**-ఇదివరకే స్థానిక ఎమ్మెల్యే.మేఘా రెడ్డికి గ్రామస్తుల వినతి**

బివనపర్తి,మార్చి 12( నీలగిరి ఎక్స్ ప్రెస్):
మా గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని వనపర్తి జిల్లా కేంద్రంలోని సమీప చిట్యాల గ్రామస్తులు గత కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నారు.'పురపాలిక వద్దు.. పంచాయతే ముద్దు' అంటూ గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో కోరారు.గత మూడు రోజుల క్రితమే గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే. మేఘా రెడ్డిని కలిసి



గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దని కోరారు.ఆ తర్వాత నుంచి సోషల్ మీడియాలో ఈ సమస్య చర్చనీయంశంగా మారింది.బుధవారం చిట్యాల గ్రామంలో జరిగిన గ్రామ సభలో గ్రామస్తులు స్పెషల్ అధికారి, ఎంపిడీఓకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్బంగా గ్రామస్తులు మాట్లాడుతూ అభివృద్ధి మాటున తమ గ్రామాన్ని వనపర్తి మున్సిపాలిటీలో కలపొద్దన్నారు.ఆ పూటకాపూట సంపాధించుకొని కాలం వెల్లదీస్తున్నామని, ఇప్పుడు మున్సిపాలిటీలో విలీనం చేస్తే తమ బతుకులు ఆగమవుతాయన్నారు.పన్నులు, నల్లాబిల్లులంటూ తమ నడ్డీ విరిచే ప్రయత్నం చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. ఇంటి పర్మీషన్ కావాలన్నా.. ఏ చిన్న పని కోసమైనా పనులన్నీ వదులుకొని మున్సిపాలిటీకి వెళ్లాల్సి వస్తదని,తమ బతుకులు బాగుపడాలంటే చిట్యాల గ్రామపంచాయతీగానే ఉండాలని కోరారు.బి

# మట్టిలో మాణిక్యం

వెల్దండ, మార్చి 12 (నీలగిరి ఎక్స్ప్రెస్): వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన సల్వాది సరస్వతి తన పట్టుదల, కృషితో ప్రభుత్వ ఉద్యోగం సాధించి గ్రామం గర్వించదగ్గ వ్యక్తిగా నిలిచారు. ఒక బీద కుటుంబంలో పుట్టిన సరస్వతి, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాల తెగకు చెందిన మహిళగా, ఎన్నో సంక్షోభాలను దాటుకుంటూ తన గురుకుల పాఠశాలలో చదువు పూర్తి చేశారు. చదువును జీవితంలో అత్యంత ప్రాముఖ్యంగా భావించిన సరస్వతి, గురువులను తన దేవతలుగా భావించి, ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో కృషి చేశారు. ఈ క్రమంలో నేడు ఆమె తెలంగాణ ప్రభుత్వ నుంచి జూనియర్ లెక్చరర్



నియామక పత్రము అందుకోవడం జరిగింది.

సరస్వతిపై గ్రామ ప్రజల అభినందనలు: సల్వాది సరస్వతికి ఈ గౌరవనీయమైన విజయాన్ని అందుకున్న సందర్భంగా, అజిలాపూర్ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు ఆమెకు అభినందనలు తెలియజేశారు. పేద కుటుంబంలో పుట్టి, సృజనాత్మకతను ప్రదర్శిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్న సరస్వతిని గ్రామస్తులు "మట్టిలో మాణిక్యం" అంటూ ప్రశంసించారు. ఈ విజయంతో, సల్వాది సరస్వతి మాత్రమే కాకుండా, ఆమె కథ అన్ని వర్గాలకు స్ఫూర్తిని నింపుతుంది. ఈ ఘటన సమాజంలోని యుక్త వయసు యువతకు మోటివేషన్‌గా నిలుస్తుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది.

# గంజాయి బ్యాచ్ అరెస్ట్



మార్చి 12 ఘట్కేసర్ ప్రతినిధి(నీలగిరి ఎక్స్ ప్రెస్)
మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి లో మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో పోలీస్ లు తమ విధులు నిర్వహిస్తుండగా ఘట్కేసర్ లోని ఎదులాబాద్ అండర్ పాస్ దగ్గరలోని ఇండియన్ గ్యాస్ గోదాము దగ్గర ఇద్దరు యువకులు అనుమాన స్పదంగా తిరుగుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు ఆ ఇద్దరి యువకులను తనిఖీ చేయగా వారి వద్ద 40 గ్రాముల గంజాయి దొరికింది వారి వివరాలు తెలుసుకోగా ఘట్కేసర్ నివాసులైన దంతూరి రాకేష్ 26 సంవత్సరములు పురోహిత్ 24 సంవత్సరాల అని తెలిసినది వారిపై కేసు నమోదు చేసి డిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించడమైనదని దర్యాప్తు కొనసాగుతున్నదని ఘట్కేసర్ పోలీసు లు మీడియాకు తెలియజేశారు

# మా మంచి మాస్టారు










-ఆ ఉపాధ్యాయుని రాకతో పాఠశాలకు మహర్దశ
-ఎక్కడ పనిచేసినా మారిపోతున్న ఆ స్కూల్ రూపురేఖలు
-దాతలు ముందుకు వస్తే మరింత అభివృద్ధి చేస్తా
-టీచర్ విష్ణువర్ధన్ నాయుడిని ప్రశంసిస్తున్న గ్రామస్తులు

**శ్రీరంగపూర్,మార్చి 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అది ఒక రంగ సముద్రం రిజర్వాయర్ ముంపుకు గురైన గ్రామం. మూడు సెంటర్లుగా విభజించబడిన గ్రామం. ప్రభుత్వం మొదటి సెంటర్లో ఆహ్లాదకరమైన వాతావరణములో విశాలమైన తరగతి గదులలో చక్కని పాఠశాల భవనం నిర్మించింది. 2వ, 3వ సెంటర్లలో ఒక్కోగది నిర్మించింది. మొదటి సెంటర్ లో బడి ప్రారంభమయ్యాక క్రమానుగతంగా 2వ, 3వ సెంటర్లలో కూడా ఒక్కో ఉపాధ్యాయునితో బడులు ప్రారంభమయ్యాయి. 2024 జూలై నెలలో జరిగిన బదిలీల అనంతరం పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు రావడం జరిగింది. 2వ, 3వ సెంటరల్లో విద్యార్థులు రాకపోవడంతో ఉపాధ్యాయులందరూ మొదటి సెంటర్లోనే పాఠాలు బోధిస్తున్నారు. అప్పటి ఉమ్మడి మండల విద్యాధికారి జయరాములు చొరవతో తిరిగి 2వ, 3వ సెంటర్లలో బడులు ప్రారంభించారు. అప్పుడు వచ్చారు 3వ సెంటర్ కి ఒక ఉపాధ్యాయుడు. అతని పేరే నాయిని విష్ణువర్ధన్ నాయుడు. ఆ గ్రామం పేరే నాగరాల. మండలం శ్రీరంగాపురం.

విష్ణువర్ధన్ నాయుడు ఓ వైపు టీచర్ గా పిల్లలకు పాఠాలు బోదిస్తూనే మరో వైపు పెయింటర్ గా రాణిస్తున్నారు. ఇతను ఎక్కడ పనిచేసిన ఆ స్కూల్ రూపు రేఖలు పూర్తిగా మారిపోయేలా పనిచేస్తున్నాడు. తన స్వంత ఖర్చులతో పాటు కొందరి మిత్రుల సహకారం తీసుకుంటూ పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్నారు. అసలే గవర్నమెంట్ బడి కావడం, పైగా నిరుపేద కుటుంభాల స్టూడెంట్లు ఉంటుండడంతో వారికి బడి పై మరింత ఇష్టం పెరిగేలా కృషి చేస్తున్నాడు. తరగతి గదులతో పాటు తరగతి గోడలు సైతం స్టూడెంట్లకు పాఠాలు చెప్పేలా అందంగా తీర్చి దిద్దుతున్నాడు. ఈయన ఎక్కడ పనిచేసినా తన గురుతర బాధ్యతను వందశాతం అమలు పరుస్తూ నిరుపేద విద్యార్థులకు అక్షర జ్ఞానం అందిస్తున్నాడు.

**ఇద్దరు నుంచి పదకొండు చేరిన స్టూడెంట్లు**




శ్రీరంగపూర్ గ్రామం వద్ద రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించడంతో నాగరాల గ్రామం ముంపుకు గురి అయ్యింది. దీంతో గ్రామాన్ని మూడు సెంటర్లు గా విభజించి పునరావాసం కల్పించారు. ఇందులో నిర్మించిన 3వ సెంటర్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విష్ణువర్దన్ నాయుడు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అప్పుడు ఇక్కడ కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే బడిలో నమోదయ్యారు. వారితోనే బోధన మొదలు పెట్టారు. ఒకటే గది. ఇద్దరే పిల్లలు. ఇది ఇలాగే కొనసాగితే మళ్లీ బడి మూయడం ఖాయం అనుకున్నారు. ఏదైనా వినూత్న ప్రయత్నం చేయాలనుకున్నారు. అప్పుడే వారి మదిలో మెదిలింది పాఠశాల అభివృద్ధి ప్రణాళిక. మొదట దాతలను సంప్రదించి బడి వాతావరణాన్ని రంగురంగులతో ఆహ్లాదకరంగా మర్చాలనుకున్నారు. మొదట వారి మిత్రులు మధుబాబుకు పాఠశాల అభివృద్ధి ప్రణాళిక వివరించారు. వెంటనే మధుబాబు ఆర్థిక సహకారానికి వీరు స్వంతంగా కొంత నగదు జమచేసి వీరే స్వయంగా చిత్రకారుడు కావడంతో పాఠశాల ముందరి భాగానికి రంగులు వేసి బోధనాభ్యాసన కృత్యాలతో కూడిన అందమైన రంగురంగుల చిత్రాలు వేశారు. తరువాత విద్యార్థులకు పాఠ్యాంశాలను వినడంతో పాటు చూసే విధంగా ఏర్పాటు చేస్తే బోధన మరింత ఆకర్షణీయంగా, అర్థవంతంగా మారుతుందని పాఠశాలకు స్మార్ట్ టి.వి. తీసుకొచ్చారు. అనతి కాలంలోనే పాఠశాల అభివృద్ధికి పరితపిస్తున్న ఆ ఉపాధ్యాయుని కృషికి గ్రామస్తులు తోడుగా నిలిచారు. పాఠశాలకు కావాల్సిన కుర్చీలు, టేబుల్, బీరువా, పుస్తకాలు ఉంచే షెల్ఫ్ వితరణ చేశారు. మరొక దాత పాఠశాల మొత్తానికి రంగులు వేయించారు. దీని కారణంగా విద్యార్థుల సంఖ్య ఇద్దరి నుండి పదకొండుకి పెరిగింది. ఇటీవలే 2వ సెంటర్ లో విద్యార్థులు లేకపోవడంతో అక్కడ ఉన్న ఉపాధ్యాయున్ని కూడా మండల విద్యాధికారి హనుమంతు గారు 3వ సెంటర్ కి కేటాయించారు. అదేవిధంగా ఇన్నాళ్ళు మొదటి సెంటర్ యూ డైస్ కోడ్ తోనే నడుస్తున్న ఈ పాఠశాలకి ప్రత్యేక యూడైస్ కోడ్ కోసం ఇటీవల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించారు. ఈ పాఠశాలకు యూ డైస్ కోడ్ లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు లేకపోవడం కనీసం ఇక్కడ మధ్యాహ్న భోజనం కూడా అమలు కావడం లేదు. దీంతో విద్యార్థులే స్వయంగా లంచ్ బాక్స్ తెచ్చుకోవడమో లేక మధ్యాహ్నం ఇంటికి వెళ్ళి తినిరావడమో జరుగుతుంది. బడిలోనే మధ్యాహ్న భోజనం ప్రారంభమయితే ఇంకా విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

ఉపాధ్యాయుని కృషి అమోఘం: తిరుపతి, లక్ష్మి నారాయణ. నాగరాల గ్రామస్తులు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం తపించే ఉపాధ్యాయుడు మా గ్రామానికి రావడం నిజంగా చాలా సంతోషంగా ఉంది. బడి రూపురేఖలు మార్చారు. అభివృధి ప్రణాళికలో మేము కూడా భాగస్వామ్యమై బడిని ఆదర్శంగా మారుస్తాం.

**దాతలు సహకరిస్తే మరింత అభివృద్ధి**

ఎన్,విష్ణువర్ధన్ నాయుడు, హెచ్ఎం, పీఎస్ నాగరాల, సెంటర్ 3.

నాగరాల సెంటర్ 3 లో ఉన్న ఈ స్కూల్ లో ఇప్పుడిప్పుడే స్టూడెంట్లను బడికి రప్పించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాను. ఇప్పటికే కొందరు దాతలు సహకరించి స్కూల్ కు తమవంతుగా సామాగ్రీ అందించారు. ఇంకా మరికొంత సదుపాయాలు, సామాగ్రీ అవసరం ఉంది. మరికొంత మంది దాతలు సహకరిస్తే ఈ పాఠశాలను మరింత అభివృద్ధి చేసి నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నా వంతు కృషి చేస్తాను అంటున్నాడు ఈ మాస్టారు.

# మూలాలకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నాం

-సిఎం ప్రజావాణి సక్సెస్ రేటు 66 శాతం
-సిఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగింది
-రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి






**వనపర్తి,మార్చి 12 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** సమస్య మూలాలకు వెళ్లి ఆ సమస్య పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తే సంపూర్ణ ఫలితం లభిస్తుందని, సీఎం ప్రజావాణిలో ఇదే తరహా పద్ధతిని తాము అనుసరిస్తున్నామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. బుధవారం ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి లో "" సిటిజన్ సెంట్రిక్ గవర్నెన్స్ ః ది రోల్ అఫ్ ప్రజావాణి అండ్ ప్రజా పాలన ఇన్ తెలంగాణ "" అనే అంశంపై జరిగిన సింపోసియంలో చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో సీఎం ప్రజావాణి అధికారులు, సిబ్బంది అంకితభావంతో బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే ప్రజావాణి ఇప్పటివరకు 110 వారాలు పూర్తి చేసుకుందని, ఇప్పటివరకు 92,072 దరఖాస్తు వచ్చాయని, అందులో వివిధ సమస్యలపై 53,303 దరఖాస్తులు రాగా అందులో 35,001 దరఖాస్తులను పరిష్కరించినట్లు చిన్నారెడ్డి వివరించారు. దరఖాస్తులు సక్సెస్ రేటు 66% ఉందని ఆయన తెలిపారు. మిగతా 38,769 దరఖాస్తులు వివిధ పథకాల కోసం రావడంతో వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారులకు పంపినట్లు చిన్నారెడ్డి పేర్కొన్నారు.

సీఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని ప్రజావాణి కి వెళితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజల్లో విశ్వాసం కలుగుతోందని ఇది కదా ప్రజాపాలన అని చిన్నారెడ్డి అన్నారు.

దరఖాస్థులలో ఎక్కువ శాతం ఇళ్ల కోసం, రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం వస్తున్నాయని, ధరణి లోపాలపై కూడా చాలా దరఖాస్తులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజావాణిలో పకడ్బందీగా సిస్టం ఏర్పాటు చేశామని, శాఖల వారీగా డెస్క్ ఆఫీసర్స్, నోడల్ ఆఫీసర్స్, స్టేట్ నోడల్ ఆఫీసర్, ఆన్లైన్ ద్వారా ఆయా శాఖలకు దరఖాస్థులు పంపించి మానిటరింగ్ చేసే డెస్క్, ట్రాకింగ్ డెస్క్ వ్యవస్థ పనిచేస్తోందని చిన్నారెడ్డి వివరించారు. ధరఖాస్థులు తాము స్వీకరించడమే కాకుండా వాటిపై ఎందర్స్మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లేడుతున్నామని చిన్నారెడ్డి తెలిపారు. ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ గారు మాట్లాడుతూ సీఎం ప్రజావాణిని ప్రతిస్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో క్షేత్ర స్థాయిలోనే సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోనున్నట్లు దివ్య పేర్కొన్నారు. హైడ్రా కమీషనర్ వీ. రంగనాధ్ మాట్లాడుతూ చెరువులు, కుంటలు, నాలాలను చెరబట్టిన వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగిస్తున్నామని, ప్రభుత్వ భూములు, ఆస్తులను కబ్జా చేస్తే సహించేది లేదని రంగనాధ్ అన్నారు.ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ హెడ్ కెప్టెన్ లింగాల పాండురంగా రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!

## బీజేపీ వైఖరిని ఖండించిన జనావత్ శ్రీరామ్ నాయక్



**ఎల్బీనగర్,మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన జనావత్ శ్రీరామ్ నాయక్ బీజేపీ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని పార్లమెంటులో మాట్లాడిన బీజేపీ మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. డీకే అరుణ వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయం కాదని, బీజేపీ పార్టీ అధికారిక వైఖరినే ప్రతిబింబిస్తున్నాయని శ్రీరామ్ నాయక్ ఆరోపించారు. గిరిజన హక్కులను కాలరాయడమే లక్ష్యంగా బీజేపీ ఈ చర్యలు చేపడుతోందని, ఇతర కులాలను కలుపుతూ రిజర్వేషన్లను చిన్నాభిన్నం చేయాలని చూస్తోందని ఆయన విమర్శించారు. గిరిజన సమాజం ఈ చర్యలను తీవ్రంగా ఖండించాలని, తమ హక్కులను కాపాడుకోవాలని శ్రీరామ్ నాయక్ పిలుపునిచ్చారు. గిరిజన నాయకులు, విద్యార్థులు, మేధావులు ఈ విషయంలో చైతన్యవంతులై, తమ హక్కుల కోసం పోరాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేయూత



**వెల్దండ, మార్చి 12 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడి మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఉదారతను ప్రదర్శించారు. ఆయన ఈ రోజు జంగిలి ఈదమయ్య కుటుంబాన్ని పరామర్శించి వారికి పది వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఇదమయ్య కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదే విధంగా, ఇటీవల మరణించిన ఈదులపల్లి సాయమ్మ కుటుంబానికి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. సాయమ్మ కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తూ, తగిన అన్ని రకాల సహాయం చేస్తానని వివరించారు. తమ కుటుంబాలకు అండగా ఉంటాననే హామీతో, ఆయన ఈ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి దశరత్ నాయక్, మాజీ సర్పంచ్ ఎల్ఎన్ రెడ్డి, వెల్దండ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, చల్ల మధుసూదన్ రెడ్డి, వెల్దండ మండల బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు జంగిలి ఆనంద్, శేఖర్ ముదిరాజ్, ఈదులపల్లి జగన్, జోగు రవికుమార్ తదితరులు పాల్గొని పరామర్శ కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

## గుండాల శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు



**వెల్దండ, మార్చి 12 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని గుండాల గ్రామంలో శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈరోజు హుండీ లెక్కింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గ్రామ ప్రజలు, దేవస్థాన అధికారులు, మరియు కమిటీ సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం పూర్తయ్యింది. ఈ లెక్కింపులో హుండీ ఆదాయం ఒక లక్ష 63 వేల 567 రూపాయలు గా నమోదైంది. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ సందీప్ రెడ్డి, వైస్ చైర్మన్ అరుణ్ నాయక్, మరియు ఈవో ప్రసాద్ మహబూబ్‌నగర్ డివిజనల్ అధికారి పాల్గొన్నారు. అదేవిధంగా, ఇన్స్పెక్టర్ వీ. న. దరి, కొమ్ము అంజయ్య, కొమ్ము లింగం, వావిళ్ళ తిరుపతయ్య, శివకుమార్ శర్మ, పర్వత్ రెడ్డి, ఆర్. సంతోష్ కుమార్ శర్మ, ఆర్. నరసింహ శర్మ, మరియు ఆర్. ఆర్. సురేషి శర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# హోలీ సందడి...
## మత్తు పదార్థాల ముప్పుపై నరేష్ దండు ఆందోళన





**హైదరాబాద్, మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగుల పండుగ హోలీ సంతోషం పంచే పర్వదినం అయినప్పటికీ, ఈ పండుగల వేళ మత్తు పదార్థాల ముప్పు పెరుగుతోందని ప్రముఖ సామాజిక కార్యకర్త నరేష్ దండు ఆందోళన వ్యక్తం చేశారు. హోలీ వేడుకల పేరిట గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా అవుతున్నట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ యువతలో ప్రతిభ పెరుగుతున్న తరుణంలో డ్రగ్ మాఫియాల లభేజీ పెరిగినంత మాత్రాన యువత భవిష్యత్‌కు ముప్పు కలగకుండా ఉండాలని నరేష్ దండు పిలుపునిచ్చారు. హోలీ వేడుకలను అవకాశంగా తీసుకుని అక్రమ ముఠాలు మత్తు పదార్థాలను విస్తరిస్తున్నాయనే విషయం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ండ్రగ్స్ ముఠాలను



నరేష్ దండు


అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ, ఎక్సైజ్ డిపార్ట్మెంట్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సంయుక్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని నరేష్ దండు విజ్ఞప్తి చేశారు. యువత భవిష్యత్‌ను కాపాడటానికి నిషేధిత మత్తు పదార్థాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. హోలీ సోదరభావానికి ప్రతీక అని, దీన్ని ఆనందంగా, పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను చేపట్టి యువతలో మార్పు తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైంది అని నరేష్ దండు అన్నారు. హోలీ వేడుకలు నిజమైన సంతోషాన్ని పంచేలా, మత్తు మాయాజాలాలకు దూరంగా జరుపుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ
## బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి



**నర్సంపేట మార్చి 12 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ గద్దెనెక్కిందని బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి విమర్శించారు. బుధవారం నల్లబెల్లి మండలం ముచింపుల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ మరియు బి.ఆర్.ఎస్ పార్టీలకు చెందిన నాయకులు రాణా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ వార్డు మెంబర్ దొమ్మటి శ్రీను యూత్ కాంగ్రెస్ నాయకులు బత్తిని మల్లికార్జున్ బీ ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కక్కెర్ల సమ్మయ్య బత్తిని కుమారస్వామి దొమ్మటి బచ్చ లింగయ్య లు బిజెపిలో చేరారు వీరికి రాణా కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు నాయకులు ప్రజలకు వివరించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ బొద్దిరెడ్డి ప్రతాప్ రెడ్డి సీనియర్ నాయకులు వల్లే పర్వతాలు పెరుమాండ్ల కోటి ధర్మారం క్రాంతి కుమార్ బొట్ల ప్రతాప్ పులి రజనీకాంత్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## దశదిన కర్మ లో పాల్గొన్న రాణా ప్రతాప్ రెడ్డి



**నర్సంపేట మార్చి 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరామ్ సతీమణి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ తల్లి విజయ దశదినకర్మ బుధవారం నిర్వహించగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరై విజయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాణా ప్రతాప్ వెంట నర్సంపేట బిజెపి పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ రూరల్ మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్ నల్లబెల్లి మండల పార్టీ అధ్యక్షుడు తడక వినయ్ జిల్లా కౌన్సిల్ మెంబర్ బొద్దిరెడ్డి ప్రతాపరెడ్డి నెక్కొండ మండల అధ్యక్షులు నాయిని అనూష అశోక్ చెన్నారావుపేట మండలం అధ్యక్షుడు శేఖర్ బిజెపి సీనియర్ నాయకులు యాక సాయిలు జిల్లా యువ మోర్చా నాయకులు అచ్చ దయాకర్ మనీష్ గౌడ్ పల్లకొండ శ్రీను ఎర్ర రాజు బానోతు రాజేందర్ సామల ప్రవీణ్ కుమార్ వేల్పుల విక్రం హేమంత్ పార్టీ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# యువకులు బాధ్యతాయుతంగా ఎదగాలి

-ఉమ్మడి జిల్లా స్థాయి యువజన ఉత్సవ్ కార్యక్రమం ప్రారంభం
-రానున్న కాలమంతా యువకులదే
-యువకులు సంస్కారవంతంగా, బాధ్యతాయుతంగా ఉండాలి
-జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్






**వనపర్తి,మార్చి12 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
యువకులుబాధ్యతాయుతంగా వెలగాలని రానున్న కాలమంతా యువకులదేనని సంస్కారం వంతంగా బాధ్యతాయుతంగా ఉండాలని వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ తెలుపునిచ్చారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రః మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి "యువ ఉత్సవ్-2025" కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశ భవితవ్యం యువత చేతుల్లో ఉందని యువకులు తమకు ఆసక్తి గల రంగాన్ని ఎంచుకొని అందులో గొప్పగా రాణించాలని సూచించారు.ఎక్కడా లేని యువశక్తి మనదేశంలో ఉందని వారు సరైన మార్గం ఎంచుకుంటే ప్రపంచంలో మనకు తిరుగులేదని పేర్కొన్నారు. తల్లిదండ్రులను,గురువులను,సాటివారిని గౌరవించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఉపాధ్యాయులు ఆసక్తి గల విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే అద్భుత ఆవిష్కరణలు వెలుగులోకి తెచ్చే విదంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సైన్స్-మేళాను ఎస్పీ నిశితంగా పరిశీలించారు.చక్కటి ఎగ్జిబిట్స్ ను తయారు చేసిన విద్యార్థినీ విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం యువ ఉత్సవ్‌లో భాగంగా 15-29 సంవత్సరాల వయస్సు కలిగిన యువతి యువకులకు నిర్వహించిన కవిత్వం,చిత్రలేఖనం, సైన్స్-మేళా , ఉపన్యాసం వంటి వివిధ రకాల పోటీలలో పాల్గొని ప్రతిభా కనబరిచిన వారికి ఎస్పీ ప్రశంసా పత్రాలు మెమోంటోలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రః మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు శ్రీ కోటనాయక్ , పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్ , జిల్లా సైన్స్ అధికారి శ్రీనువాస్ , డివైఎస్‌వో సుదీర్ రెడ్డి , రెడ్‌క్రాస్ సొసైటీ రాజేందర్ , తెలుగు అధ్యాపకుడు ఎజ్జు మల్లయ్య, నిస్వార్థ ఆర్గనైజేషన్ సభ్యులు అరవింద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్నెహ్రూ యువకేంద్రః ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ రాజేందర్‌గౌడ్ , అనిల్‌కుమార్ గౌడ్ తదితరులతో పాటు జిల్లాలోని వివిధ పాఠశాలల, కళశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో ఇఫ్తార్ విందు ఓ భాగం..

-బీఆర్ఎస్ యువ నాయకుడు వై. రవీందర్ యాదవ్..
-షాద్ నగర్ చౌరస్తా మజీదులో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న వై. రవీందర్ యాదవ్..
-బీఆర్ఎస్ నాయకుడు పల్లె శ్రీనివాస్ రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పట్ల హర్షం..
-హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు..



**షాద్ నగర్, మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ముస్లిం సోదరుల పవిత్ర మాసమైన రంజాన్ ఉపవాసాలను పురస్కరించుకొని, మతాలకతీతంగా ఇఫ్తార్ విందు లను ఏర్పాటు చేయడం సామాజిక సేవలు ఒక భాగమని బీఆర్ఎస్ యువ నాయకుడు వై. రవీందర్ యాదవ్ అభిప్రాయపడ్డారు. బుధవారం షాద్ నగర్ చౌరస్తాలోని మజీద్ వద్ద చిల్కమర్రి మాజీ సర్పంచ్ పల్లె శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి అంటేనే మత సామరస్యాలకు ప్రతిక అని, ముస్లిం సోదరులు రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఇఫ్తార్ విందు లను ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. అల్లా దయవల్ల అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతు లతో ఉండాలని, ముఖ్యంగా రైతులు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచులు మోబిన్ ఘోరీ, అశోక్, మచ్చేందర్, రంగయ్య గౌడ్, చందు నాయక్, చంద్రశేఖర్, రంగయ్య, సాయి యాదవ్, మాజీ కౌన్సిలర్లు చింటూ, వెంకట్రాంరెడ్డి, జూపల్లి శంకర్, నాయకులు వీరేశం గుప్తా, నక్కల వెంకటేష్ గౌడ్, రఘుపతి రెడ్డి, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), బిలాల్, పర్వేజ్, అజహార్, సాధక్, చిలకమర్రి ఆనంద్, మహబూబ్, రహమత్ అలీ, అబ్బాస్, మినాజ్ తదితరులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు..

# సంపాదకీయం

# నీరు: జీవానికి మూలాధారం, ఆరోగ్యానికి ఆధారం



నీరు ప్రాణాధారం. మనిషి ఆహారం లేకుండా కొన్ని రోజుల పాటు బతికేయగలడు, కానీ నీరు లేక?? కూడా బ్రతకడం అసాధ్యం. శరీరంలోని ప్రతి అవయవం, ప్రతి కణం, ప్రతి ప్రక్రియకూ నీరు అత్యవసరం. అయినప్పటికీ, సమకాలీన జీవనశైలిలో చాలా మంది తగినంత నీరు తాగడం విస్మరిస్తున్నారు. ముఖ్యంగా ఏసీ గదుల్లో ఎక్కువ సమయం గడిపే ఉద్యోగస్తులు, బద్ధకంతో నీటిని తక్కువగా తీసుకునే ప్రజలు దీని ప్రభావాన్ని తీవ్రంగా అనుభవిస్తున్నారు. నీటి లోపం శరీరంలో అనేక రకాల సమస్యలకు కారణమవుతుంది.

**శరీరానికి నీటి ప్రాముఖ్యత**

మన శరీరం సుమారు 60-70% నీటితో కూడి ఉంటుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడం, పోషకాలను సరఫరా చేయడం, వ్యర్థాలను బయటికి పంపించడం, శక్తి ఉత్పత్తిని మెరుగుపరచడం వంటి అనేక ముఖ్యమైన పనులు చేస్తుంది. నీరు లేకపోతే, శరీరంలోని అవయవాల పనితీరు మందగిస్తుంది, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

**నీరు తక్కువగా తాగినప్పుడు కలిగే సమస్యలు**

తగినంత నీరు తాగకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి:

1. **కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు:** శరీరంలోని కీళ్లను రక్షించే కార్టిలేజ్ సుమారు 80% నీటితో నిర్మితమై ఉంటుంది. తగినంత నీరు తాగకపోతే, ఇది నిర్జలీకరణానికి గురవ్వడం వల్ల కీళ్ల నొప్పులు, కండరాల అలసట ఏర్పడతాయి.
2. **తలనొప్పి-గుండె పోటు ప్రమాదం:** మెదడుకు తగిన రక్త ప్రసరణ జరగకపోవడం, ఆక్సిజన్ సరఫరా తగ్గిపోవడం వల్ల తలనొప్పి ఎక్కువగా వస్తుంది. దీర్ఘకాలం నీరు తక్కువగా తాగితే గుండె ఆరోగ్యంపైనా ప్రభావం పడుతుంది.
3. **జీర్ణ సమస్యలు:** నీరు సరిపోకపోతే, ఆహారం సరిగ్గా జీర్ణం కావడం కష్టమవుతుంది. ఫలితంగా మలబద్ధకం, ఆమ్లత్వం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి.
4. **శక్తి లోపం - అలసట:** రక్తపోటు తగ్గిపోవడం వల్ల శరీరానికి తగిన ఆక్సిజన్ సరఫరా జరగదు. దీనివల్ల ఒంట్లో శక్తి లేకపోవడం, పనిలో నిరుత్సాహం, బద్ధకం పెరుగుతాయి.
5. **యూరిన్ మార్పులు:** తగినంత నీరు తాగకపోతే యూరిన్ గాఢమైన పసుపు రంగులో ఉంటుంది. అలాగే, రోజుకు కనీసం 4-7 సార్లు యూరిన్ పోవకపోతే, మీ శరీరానికి తగినంత నీరు అందడం లేదని అర్థం.
6. **మెదడు పనితీరుపై ప్రభావం:** నీటి లోపం మానసిక స్పష్టతను, ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని తగ్గిస్తుంది. దీర్ఘకాలం నీరు తక్కువగా తాగితే, మెదడు మాంద్యం (Brain Fog) వంటి సమస్యలు వస్తాయి.
7. **చర్మ సమస్యలు:** నీరు తక్కువగా తాగడం వల్ల చర్మం పొడిబారడం, ప్రకాశం తగ్గిపోవడం, పెదాలు చిట్లిపోవడం, ముడతలు పడడం జరుగుతుంది.

**ఎంత నీరు తాగాలి?**

అందరూ ఒకేలా నీరు తాగాలి అనే నియమం లేదు. అయితే, సగటున రోజుకు 2.5 - 3 లీటర్ల నీటిని తాగడం ఉత్తమం. అయితే, వాతావరణ పరిస్థితులు, శరీర బరువు, దినచర్యను బట్టి నీటి అవసరం మారుతుంది.

**ఎండాకాలం:** తేమ తగ్గిపోవడం వల్ల ఎక్కువ నీరు అవసరం.

వ్యాయామం లేదా శారీరక శ్రమ: చెమట ద్వారా నీరు తగ్గిపోవడం వల్ల అధికంగా తాగాలి.

గర్భిణీలు & తల్లిపాలివ్వే మహిళలు: వారి శరీర అవసరాల దృష్ట్యా సాధారణం కంటే ఎక్కువ నీరు తాగాలి.

**నీరు తాగే అలవాటు ఎలా చేసుకోవాలి?**

ప్రతి గంటకూ ఒక గ్లాస్ నీరు తాగడం అలవాటు చేసుకోవాలి.

ఉదయం లేచిన వెంటనే స్వచ్ఛమైన గ్లాస్ నీరు తాగాలి.

మిరుమిట్లు గొలిపే రంగుల గాజు బాటిల్స్, రిమైండర్ యాప్స్ ఉపయోగించడం ద్వారా నీరు తాగే అలవాటు చేసుకోవచ్చు.

అధిక షుగర్ కలిగిన ఫ్లేవర్డ్ డ్రింక్స్‌ను దూరంగా ఉంచాలి.

కొబ్బరి నీరు, నిమ్మరసం, గ్రీన్ టీ వంటి హైడ్రేటింగ్ డ్రింక్స్‌ను కూడ ఉపయోగించుకోవచ్చు.

నీరు ఆరోగ్యానికి ఎలాంటి వరమో తెలుసుకుని, ఇప్పటి నుంచే తగినంత నీరు తాగే అలవాటు చేసుకుందాం. శరీరాన్ని పోషించి, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం!

వ్యాస కర్త
చెరుకు జంగయ్య గౌడ్



# విద్యా రంగానికి 15% బడ్జెట్ కేటాయించాలని ఎబివిపి డిమాండ్

వెల్దండ, మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)

తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నేతలు డిమాండ్ చేశారు. వెల్దండ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఏబీవీపీ నాయకులు, విద్యా రంగంలో ఉన్న సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

తాటికొండ ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాట్లాడుతూ విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 8 వేల కోట్ల రూపాయల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అలాగే ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రశాంత్ పేర్కొన్నట్లు, ఈశాన్య రాష్ట్రాలు తమ బడ్జెట్‌లో 12-13 శాతం నిధులు కేటాయిస్తుంటే, తెలంగాణలో కేవలం 7 శాతం నిధులు మాత్రమే కేటాయించడం సిగ్గుచేటు. పైగా, ఆ నిధులను కూడా పూర్తిగా విడుదల చేయలేదని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తుండటంతో పేద విద్యార్థులు మధ్యలోనే చదువును ఆపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



గురుకులాలు మరియు డిగ్రీ కళాశాలలు తగిన సౌకర్యాలు లేక విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని, గత 15 నెలల్లో 83 మంది విద్యార్థులు మరణించారని తెలిపారు. 70 శాతం బోధన సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల విద్యా ప్రమాణాలు తగ్గిపోతున్నాయని, విశ్వవిద్యాలయాలకు తగిన బ్లాక్ గ్రాంట్లు కేటాయించకపోవడం వల్ల విద్యార్థులపై ఆర్థిక భారం పెరుగుతోందని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పిందని విమర్శించారు.

**ఏబీవీపీ డిమాండ్లు:**

- విద్యా రంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయింపు.
- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిల విడుదల.
- ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టుల భర్తీ.
- విశ్వవిద్యాలయాలకు తగిన బ్లాక్ గ్రాంట్ల కేటాయింపు.

**నిరసన హెచ్చరిక:** విద్యార్థులు, నిరుద్యోగ యువత, మరియు సమాజం ఈ ప్రభుత్వాన్ని ఉపేక్షించబోమని ఏబీవీపీ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి అక్కి వంశీ, ఇతర కార్యవర్గ సభ్యులు, మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తొందరగా పిల్లలను కనండి

## పెళ్లయిన జంటకు ఉదయనిధి సూచన




చెన్నై,మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)

లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే, రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని అక్కడి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా ఉదయనిధి 72 మంది జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు. అయితే ఎక్కువ మందిని మాత్రం కనొద్దని సూచించారు. ‘ 2026 తర్వాత అమల్లోకి వచ్చే ఈ డీలిమిటేషన్ పక్రియ జనాభా ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాలను తిరిగి రూపొందిస్తుంది. రాష్టాల్లోని జనాభాకు సరైన ప్రాతినిధ్యం లభించేలా పార్లమెంటులో , అసెంబ్లీల్లో సీట్లుండేలా చూసే పక్రియలో ఎక్కువ సీట్లు ఇవ్వాలంటే , కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు జనాభా సంఖ్యను పర్యవేక్షిస్తోంది. తమిళనాడుతోసహా దక్షిణాది రాష్టాలు దశాబ్దాలుగా జననాల రేటను నియంత్రిస్తూ వస్తున్నాయని, దీని మూలంగా పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో వాటి వాటా తగ్గే అవకాశం ఉంది ‘ అని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమిళనాడు నుంచి 39 మంది ఎంపీలు ఉన్నారని, రాష్ట్ర జనాభబూ 7 కోట్లు కాబట్టి , డీలిమిటేషన్ పక్రియ అమల్లోకి వస్తే ఆ సంఖ్య 31 కి తగ్గుతుందని ఆయన అన్నారు. అయితే ఎక్కువ జనాభా ఉన్న ఉత్తరాది రాష్టాలు మాత్రం 100 కు పైగా సీట్లు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని ప్రకారం చూస్తే రాష్ట్ర జనాభా కూడా అధికంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# 30 రోజుల కాల్పుల విరమణకు అంగీకరించిన జెలెన్‌స్కీ


జెడ్డా-మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)



ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కాల్పుల విమరణ కు అంగీకరించినట్లు తెలుస్తోంది. అమెరికా చేసిన ప్రతిపాదనకు ఆయన ఆమోదం తెలిపారు. తక్షణమే 30 రోజుల పాటు కాల్పుల విమరణ పాటించాలని అమెరికా తన ప్రతిపాదనలో పేర్కొన్నది. సౌదీ అరేబియాలోని జెడ్డాలో అమెరికా ప్రతినిధులతో ఉక్రెయిన్ బృందం జరిపిన చర్చల్లో ఈ ఒప్పందం కుదిరింది. రెండు దేశాల సీనియర్ అధికారుల భేటీ తర్వాత ప్రకటన రిలీజ్ చేశారు.కాల్పుల విరమణ ఒప్పందాన్ని రష్యాకు చేరవేస్తామని అమెరికా తెలిపింది. అయితే ఉక్రెయిన్‌పై విధించిన ఆంక్షలను ఎత్తివేయనున్నట్లు అమెరికా వెల్లడించింది. ఇంటెలిజెన్స్ షేరింగ్, సెక్యూర్టీ సహకారం ఇవ్వనున్నట్లు తెలిపింది. శాంతి దిశగా అడుగులు వేసేందుకు రెండు దేశాలకు చెందిన ప్రతినిధులు మళ్లీ చర్చలు చేపట్టనున్నారు. చర్చల ప్రక్రియలో రష్యా ప్రమేయాన్ని అమెరికా ఆశిస్తున్నది. అలాగే ఆ ప్రక్రియలో యురోపియన్ దేశాలు ఉండాలని ఉక్రెయిన్ కోరుతున్నది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, నేషనల్ సెక్యూర్టీ అడ్వైజర్ మైక్ వాల్జ్.. ఉక్రెయిన్ అధికారులతో జరిగిన భేటీలో పాల్గొన్నారు. ఉక్రెయిన్ బృందంలో అధ్యక్షుడు జెలెన్‌స్కీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఉన్న ఆండ్రీ యెర్మాక్, విదేశాంగ మంత్రి ఆండ్రీ సైబిహ, డిఫెన్స్ మంత్రి రుస్తెం ఉమెరోవ్, ఇతరులు ఉన్నారు. సౌదీ విదేశాంగ మంత్రి ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్ కూడా మీటింగ్‌లో పాల్గొన్నారు. ఉక్రెయిన్‌తో తాత్కాలిక కాల్పుల విరమణకు రష్యా అంగీకరిస్తుందన్న అభిప్రాయాన్ని అమెరికా మంత్రి మార్కో రూబియో వ్యక్తం చేశారు. ఒప్పందంపై రియాక్ట్ అయిన జెలెన్‌స్కీ.. ఒకవేళ రష్యా అంగీకరిస్తే, తక్షణమే కాల్పుల విరమణ అమలులోకి వస్తుందన్నారు. త్వరలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ట్రంప్ కలుసుకోనున్నారు. ఆ భేటీలో షరతులపై తుది అంగీకారం జరిగే అవకాశాలు ఉన్నాయి.

# అమెరికా మద్యంపై 150 శాతం సుంకం విధిస్తున్న భారత్

న్యూయార్క్ మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)



డోనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధం నేపథ్యంలో.. ఇండియాపై శ్వేత సౌధం కీలక ఆరోపణ చేసింది. అమెరికా మద్యం, వ్యవసాయ ఉత్పత్తులపై .. భారత్ అధిక స్థాయిలో సుంకాలు వసూల్ చేస్తున్నట్లు చెప్పింది. అమెరికన్ మద్యంపై భారత్ 150 శాతం దిగుమతి సుంకాన్ని వసూల్ చేస్తున్నట్లు వైట్‌హౌజ్ ప్రెస్ కార్యదర్శి కరోలిన్ లివిట్ తెలిపారు. అమెరికా వస్తువులపై వివిధ దేశాలు విధిస్తున్న సుంకాలకు సంబంధించిన గణాంక వివరాలను ఆమె వైట్‌హౌజ్‌లో మీడియాకు వెల్లడించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. అమెరికా మద్యంపై ఇండియా భారీగా సుంకాన్ని వసూల్ చేస్తుందన్నారు.